క్లుప్తంగా

ఒకటిన రక్తదాన శిబిరం

గోదావరిఖనిటౌన్: తలసేమియా, సికిల్‌సెల్ పిల్లల సహాయార్థం మార్చి 1న స్థానిక ఎల్‌బీనగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు 32వ డివిజన్ కార్పొరేటర్ ఐత శివకుమార్ తెలిపారు. ఆలయ ఫౌండేషన్ నిర్వాహకుడు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ జన్మదినం సందర్భంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

'పెద్దపల్లి ఎంపీ టికెట్ వంశీకివ్వాలి'

మంథని: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ గడ్డం వంశీకివ్వాలని నాయకులు కోరారు. సోమవారం మంథనిలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తోటపల్లి గట్టయ్య, హరీష్, కాసిపేట మల్లయ్య, రాజేందర్, బొందరయ్య, కిరణ్, అఖిల్, అశోక్, అనిల్ తదితరులున్నారు.

కళాశాల ఎదుట శుభ్రం చేసిన మున్సిపల్ సిబ్బంది



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం వద్ద మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. అపరిశుభ్రంగా ఉన్న గడ్డి తొలగించడంతోపాటు చెత్తను తొలగించి కాల్చారు. ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

కమాన్‌పూర్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పరిష్కరించేలా కృషి చేయాలని ఎంపీపీ రాసకొండ లక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొనకుండా చర్యలు చేపట్టాలని ఎంపీటీసీలు బోనాల వెంకటస్వామి, కోలేటి చంద్రశేఖర్, గొడిసెల ఉమ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో దేవరకొండ ఉమేష్, తహసీల్దార్ ఆరిఫుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించాలి



ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ పనులపై సమావేశం

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఉపాధిహామీలో పనుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఉపాధి పనుల నిర్వహణ, నర్సరీల పెంపకం, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ.. పనుల ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఏపీవో సదానందం, పంచాయతీ కార్యదర్శులు లచ్చయ్య, ఆంజలీధర్, ఫీల్డ్ అసిస్టెంట్లు నర్సయ్య, తిరుపతి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవండి



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గోదావరిఖనిటౌన్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం ఒత్తిడి లేకుండా భయం వీడి ప్రణాళికాబద్ధంగా చదవాలని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం పీఎస్‌టీల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మార్కండేయకాలనీలోని రేయిన్‌బో పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయనను లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి గోపాల్‌రావు, సెక్రటరీ కళావతి, కోశాధికారి మనీశా అగర్వాల్ పాల్గొన్నారు.



గోదావరిలో వ్యర్థాల తొలగింపు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరినదిలో ఇటీవల శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర వేడుకలు కొనసాగిన విషయం తెలిసిందే. ఎంపీవో మోతె సమ్మిరెడ్డి ఆదేశాల మేరకు జాతర ప్రాంగణాల్లో గోలివాడ పంచాయతీ కార్యదర్శి స్రవంతి పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు.



మల్లన్న పట్నాలు

పెద్దపల్లిరూరల్: శరణు శరణు మల్లన్న స్వామి అంటూ పల్లె ప్రజలు మల్లన్న పట్నాలతో మొక్కులు సమర్పించుకుంటున్నారు. మల్లన్న పట్నాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యామని ఒగ్గు కళాకారులు పేర్కొంటున్నారు. కొందరు ఓదెల, కొమురెల్లి లాంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లి మల్లన్న పట్నాలతో మొక్కులు సమర్పించుకుంటున్నారు.

పరామర్శ



సుల్తానాబాద్: భారత రాష్ట్ర సమితి నాయకులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముత్యం సునీత భర్త ముత్యం రమేశ్‌గౌడ్ కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. రమేశ్ దశదినకర్మ కార్యక్రమానికి హాజరై మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రమేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీలు బాలాజీరావు, కూనారపు రేణుకాదేవి, నల్ల ఫౌండేషన్ చైర్మన్ నల్ల మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు సురేందర్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్లు సందీప్‌రావు, శ్రీగిరి శ్రీనివాస్, వెంకటరెడ్డి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



రాములపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం రాములపల్లిలో రూ.7లక్షలు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు, రూ.5లక్షలు ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రాములపల్లితోపాటు గంగిరెడ్డులకాలనీల్లో సైతం పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని, ప్రభుత్వ అసైన్డ్ భూములుండి పట్టాలు లేని పేదవారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా పట్టాలను పంపిణీ చేస్తుందన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు భూర్ల సత్యనారాయణ, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బాలుసాని పరశరాములుగౌడ్, కొండ తిరుపతిగౌడ్, పోల్సాని పుల్లారావు, దేవరాజు, వెంకట్‌రెడ్డి, బాసంపల్లి కొండయ్య, రమేశ్, అమ్ముల రమేశ్, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, కోట లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో క్షేత్రస్థాయి పర్యటన



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్, సోమనపల్లి, విసంపేట, టీటీఎస్ అంతర్గాం గ్రామాల్లో సోమవారం ఎంపీడీవో ఎంఏ అలీం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నర్సరీల్లో మొక్కల పెంపకం తదితర అంశాలను పరిశీలించారు. రాబోయే వర్షాకాలానికి నిర్దేశిత లక్ష్యం మేరకు గ్రామాలవారీగా హరితహారంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించే విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే గ్రామాలవారీగా ఉన్న నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కల రకాలు, మొక్కల సంఖ్య, స్థితిగతులు తదితర అంశాలపై నర్సరీ నిర్వాహకులతో చర్చించారు. రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండడంతో.. మొక్కల సంరక్షణపై పలు సూచనలు, సలహాలిచ్చారు. ఓటు ప్రాధాన్యం, ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై అంతర్గాం హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్ తదితరులున్నారు.

టవర్ ఎక్కి హల్‌చల్

కాల్వశ్రీరాంపూర్: జగ్గయ్యపల్లెకు చెందిన రాజు అనే మతిస్థిమితం లేని వ్యక్తి విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికులిచ్చిన సమాచారం మేరకు కాల్వశ్రీరాంపూర్ పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని ఆ వ్యక్తిని కిందికి దింపారు. పోలీస్ స్టేషన్‌లో రాజును పోలీసులు విచారించారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో మతిస్థిమితం లేని వ్యక్తి అని భావించిన పోలీసులు హెచ్చరిక చేస్తూ వదిలేశారు.

ఆధ్యాత్మికం

మంత్రి, ఎమ్మెల్యేకు సన్మానం



రామగుండం: హైదరాబాద్ చీర్యాలలోని శ్రీశ్రీశ్రీ చిర్యాల లక్ష్మినర్సింహాస్వామి దేవస్థాన సముదాయంలో సోమవారం శివుడి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ హాజరయ్యారు. దేవస్థానం ప్రతినిధులు వారిని శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠ

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని కృష్ణానగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీపోచమ్మ తల్లి ఆలయంలో మంగళవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యుడు కట్టికోల వేణుగోపాలరావు తెలిపారు. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ప్రముఖ పూజారి శ్రీగోవర్ధనగిరి జగన్నాథచార్యుల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 10.25గంటలకు అమ్మవారి విగ్రహ, యంత్రస్థాపన, త్రిబంధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గురువారం మధ్యాహ్నం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో బోనాల సమర్పణ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.

క్లబ్ 2

రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో వ్యాపారి శ్రీధర్ పండ్లతో రుద్రాభిషేకం చేశారు. అన్న పూజ నిర్వహించి శేష వస్త్రాన్ని అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

నేడు గోలివాడ జాతర హుండీల లెక్కింపు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరి శివారులో జరిగిన శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరలో ఏర్పాటు చేసిన హుండీల లెక్కింపు మంగళవారం చేపట్టనున్నామని జాతర ఈవో రాజ్‌కుమార్ పేర్కొన్నారు. 15 హుండీలతోపాటు బట్ట సంచి హుండీ మొత్తంగా 16 హుండీల్లో భక్తులు వేసిన నగదును లెక్కించనున్నామన్నారు.

రేపు నీరుకుల్లలో..

సుల్తానాబాద్‌రూరల్: నీరుకుల్ల సమ్మక్క-సారలమ్మ జారత హుండీ లెక్కింపును బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎండోమెంట్ కార్యనిర్వహణాధికారి శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీపాద జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయం

ముత్తారం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సదానందం పేర్కొన్నారు. సోమవారం ముత్తారంలో కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడారు. పీఏపీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావును సన్మానించారు. దొడ్డ బాలాజీ, వజీద్‌పాషా, వెల్మారెడ్డి పాల్గొన్నారు.

పోరాటాల వారసత్వాన్ని కొనసాగిద్దాం



నివాళి అర్పిస్తున్న ప్రజాపంథా ప్రతినిధులు

రామగుండం: సమాజ మార్పునకు విప్లవ పోరాటాల వారసత్వాన్ని కొనసాగించాలని, ప్రగతిశీల విప్లవోద్యమంలో ఎంతోమంది విప్లవకారులు అమరులయ్యారని, వారి త్యాగాలు, ధైర్యసహసాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా నాయకుడు గుమ్మడి వెంకన్న అన్నారు. విప్లవోద్యమంలో అమరులైన కత్తెరమల్ల పోశం, ఆరుముళ్ల భూమన్న వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని అబాది రామగుండం శివారులోని అమరుల స్తూపాల వద్ద నివాళి అర్పించారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్, ప్రజాపంథా జిల్లా ప్రతినిధులు మార్త రాములు, తేజేశ్వర్, తిరుపతి, ఓదెలు, శంకర్, లచ్చన్న, రమేశ్, రాయమల్లు తదితరులున్నారు.

అబాకస్ పోటీలకు ఎంపిక



జూలపల్లి: తెలంగాణ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు ఆదివారం హైదరాబాద్‌లోని విశ్వం పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణలోని వివిధ పాఠశాలలకు చెందిన 385 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని జూపిటర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థి బి.శ్రీశాంత్ సీనియర్ లెవల్ 2 విభాగంలో చాంపియన్‌గా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్టార్ జూనియర్స్ 3 విభాగంలో వి.శ్రీనిజ రెండో స్థానంలో నిలిచింది. విద్యార్థులకు మార్చిలో పుణెలో పోటీలుంటాయని విశ్వం అబాకస్ సీఈవో రవిచరణ్ తెలిపారు. ట్రస్మా ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు, పాఠశాల కరస్పాండెంట్ ఆందె కుమార్ అభినందించారు.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణప్రియ

సుల్తానాబాద్: కరాటే పోటీల్లో ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించాలని కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్ తెలిపారు. ఈనెల 25న కరీంనగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జి.హర్షవర్ధన్ కట, స్పారింగ్, ఎస్.సృజన్, ఎ.విశ్వాస్ కట విభాగంలో బంగారు పతకాలు సాధించారు. సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు.

సివిల్ రైట్స్ డే నిర్వహించండి



యైటింక్లయిన్‌కాలనీ: వినతి పత్రం అందిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఎస్సీ, ఎస్టీల సాధకబాధకాలు, అణగారిన వర్గాల ప్రజలు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించే దిశగా నిర్వహించే సివిల్ రైట్స్ డే(పౌర హక్కుల దినం)ను ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం నాయకుడు బూడిద సమ్మయ్య ఆర్ఐ రాజబాబుకు వినతి పత్రం అందజేశారు. రామగిరి మండల ప్రధాన కార్యదర్శి బూడిద సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, కనకయ్య, రామస్వామి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంథని: ప్రతి నెల చివరి తేదీన నిర్వహించే పౌర హక్కుల దినాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రజాసంఘాల నాయకులు సోమవారం మంథని తహసీల్దార్ రాజయ్యకు వినతి పత్రం అందించారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మంథని మండల కన్వీనర్ కాసిపేట పోశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, దళిత సంఘాల నాయకులు కస్నూరి బాపు, తోకల మల్లేష్, అక్కపాక కుమార్, రామగిరి కుమార్ ఉన్నారు.

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ప్రభుత్వాధికారులంతా పాల్గొని దళిత కాలనీల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని అంబేడ్కర్ సంఘ నాయకులు మామిడిపల్లి బాపయ్య, బొంకూరి మధు, ఆరెల్లి మల్లేశ్ కోరారు. సోమవారం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు.

కమాన్‌పూర్: గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందు అధికారికంగా నిర్వహిస్తున్న పౌర హక్కుల దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కోరుతూ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

రక్షణ లేకుండా ఓసీపీ-3లో పనులు



నిరసన తెలుపుతున్న కార్మికులు

గోదావరిఖని: ఓసీపీ-3లో రక్షణ లేకుండా పనులు నిర్వహిస్తున్నారని, కార్మికులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం సీహెచ్‌పీ ప్రాంతాన్ని సందర్శించారు. సీహెచ్‌పీ వద్ద సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదకరంగా తయారైందన్నారు. కోల్‌డంప్ చేసే ప్రాంతంలో ఎగుడుదిగుడుగా ఉండి అన్‌లోడింగ్‌కు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. దుమ్ముధూళితో నిండి క్యాబిన్ అద్దాల నుంచి ఏమి కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం పట్టించుకొని సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచాలని, రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. నాయకులు ఎల్.ప్రకాశ్, రాజరత్నం, రవీందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



సాక్షి స్పందన

కమాన్‌పూర్: మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై గుండారం గ్రామ శివారులో రహదారికిరువైపులా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి దారికి దూరంగా నూతనంగా స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈనెల 12న ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు అనే కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. స్పందించిన కమాన్‌పూర్ విద్యుత్ శాఖ ఏఈ రాజేంద్రకుమార్ కాంట్రాక్టరతో పాత స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేయించారు.

ప్రభుత్వ పథకాలపై ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న సాంస్కృతిక సారథి కళాకారులు

జ్యోతినగర్: ప్రభుత్వ పథకాల వినియోగంతోపాటు ఆరోగ్య పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లోని మల్యాపూర్ గ్రామంలో కళాకారులు ప్రభుత్వ రెండు గ్యారంటీ పథకాల అమలు వివరాలతోపాటు పలు పథకాలకు సంబంధించిన అంశాలను వివరించారు. డ్రగ్స్, గుట్కా, గంజాయి మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. దయానర్సింగ్, గుండ్ల స్నేహలత(టీమ్ లీడర్), మంథని స్పందన, నారగోని సరిత, బుర్ర శంకర్‌గౌడ్, జక్కుల స్వప్న, జన్నే శ్వేత, ఉప్పు స్పందన, సానగొండ రవీందర్, మంథని వెంకటస్వామి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్: సుద్దాలకు చెందిన నరేష్(25) అనే యువకుడు సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై వినిత వివరాల ప్రకారం.. నరేష్ ఆరు నెలల క్రితం నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండగా.. ఆసుపత్రిలో చూపించినా తగ్గలేదు. ఫిబ్రవరి 10న ఇంటి నుంచి పొలం వద్దకెళ్లి అక్కడ పురుగుల మందు తాగి తన అక్కకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు వెంటనే సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడినుంచి కరీంనగర్ తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో 19న హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

సొసైటీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

ఓదెల: పొత్కపల్లి సహకార సొసైటీ చైర్మన్‌పై సోమవారం అవిశ్వాసం నెగ్గింది. చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ మద్దెల కమలపై సభ్యులు అవిశ్వాసానికి తీర్మానం చేశారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల ఆధ్వర్యంలో పది మంది సభ్యులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంతాల సమ్మిరెడ్డి, బొంగోని శ్రీనివాస్‌గౌడ్, కొట్టె దేవేందర్, తాళ్లపల్లి సదయ్య, చింతం కుమారస్వామి, గుగులోతు పర్శ్యానాయక్, కట్కూరి కవిత, కొట విజయ హాజరై చేతులెత్తారు. మంగళవారం నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికవుతారని డీసీవో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న నర్సింహారావు

గోదావరిఖని: ఈపీ గ్రీజర్ హెల్పర్ ఎంపిక కోసం సోమవారం ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 బేస్ వర్క్‌షాప్‌లో ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 22 పోస్టులకు 32మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, డీవైఎస్ఈ శ్రీధర్, డీవైపీఎం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల జెండాలతో నిరసన

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ.. దేశ రాజధానిలో రైతులపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.